Eenadu Dt 29/07/15





- ప్రత్యామ్నాయ పనుల కింద రూ.కోట్ల అభివృద్ధి
- అత్యాధునిక హంగులతో పాఠశాలలు, మార్కెట్లు

ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల పనులంటే ఒక పట్టాన పూర్తవ్వవు.. అప్పటికప్పుడు పబ్బం గడుపుకొనేందుకు నేతలు, అధికారులు ఎన్నో మాటలు చెబుతారు.. తర్వాత వాటిని గాలికొదిలేస్తారు.. పనులు మొదలు పెట్టేందుకే సంవత్సరాలు ఎదురుచూడాల్సి వస్తుంటుంది. మొదలెట్టిన పనులు కూడా ఎప్పటికి పూర్తవుతాయో చెప్పలేం. అనుభవాలతో ప్రజలు ఏర్పరచుకున్న అభిప్రాయాలివి..!!

# 'మెట్రో' పరిహారం.. నగరానికి మణిహారం

ఈనాడు, హైదరాబాద్

ముఖ్యంగా భూములు, ఆస్తులు పోగొట్టుకున్న బాధితులకు చేదు అనుభవాలే ఎక్కువ. తమకు న్యాయమైన పరిహారం ఇవ్వలేదని వారు ఆందోళనకు దిగుతుంటారు. హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ ఈ అభిప్రాయాన్ని మార్చి వేసే ప్రయత్నంలో సఫలీకృతం అవుతోంది. నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ చేపట్టిన మెట్రో రైల్ నిర్మాణ పనులను సజావుగా సాగేలా చూడటంతో పాటు ప్రాజెక్ట్‌తో ప్రభావితం అవుతున్న అంశాలను తమదైన శైలిలో పరిష్కరిస్తోంది.

## కార్యాలయాల నిర్మాణం

సేకరించిన స్థలాల స్థానంలో ఆయా ప్రభుత్వ సంస్థల అభ్యర్థనల మేరకు అధునాతన కార్యాలయాలను హెచ్ఎంఆర్ నిర్మించి ఇస్తోంది. ఇప్పటికే కొన్నింటిని పూర్తిచేసింది. నాంపల్లిలో తహసీల్దార్ కార్యాలయం భవనాన్ని నిర్మించింది. యాత్రీనివాస్ ప్రాంతంలో ఆర్‌డీవో, తహసీల్దార్ కార్యాలయ భవనం నిర్మాణంలో ఉంది. రసూల్‌పురాలో పోలీసు బ్యారెక్స్, పాతగాంధీ ఆసుపత్రి సమీపంలో విశ్రాంతి గదులను నిర్మించనుంది.



కొత్త మార్కెట్ నమూనా



## 'మోడల్'గా రైతు బజార్

భరత్‌నగర్‌లో ఫ్లై ఓవర్ పక్కనే ఏళ్ల తరబడిగా కూరగాయల మార్కెట్ కొనసాగుతోంది. మెట్రో స్టేషన్ నిర్మాణం కోసం అక్కడ ఉన్న రైతుబజార్ స్థలాన్ని హెచ్ఎంఆర్ సేకరించింది. కొత్తగా అక్కడ అధునాతనంగా మోడల్ రైతుబజార్‌ను నిర్మించేందుకు ఏర్పాట్లు చేసింది. స్థల సేకరణతో వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా ఫ్లైఓవర్ కింద గోడౌన్లకు హెచ్ఎంఆర్ అద్దె చెల్లిస్తూ అక్కడ తాత్కాలిక మార్కెట్‌ను సర్దుబాటు చేసింది. కొత్తగా ఇక్కడ దుకాణ సముదాయాలు నిర్మించాక వీరిని అక్కడికి తరలించనున్నారు.

## చాలామంది ముందుకొస్తున్నారు..

నగరంలో పార్కింగ్, సర్క్యులేషన్ కోసం చాలా ప్రాంతాల్లో స్థలాలు అవసరమయ్యాయి. ప్రారంభంలో సేకరించడానికి వెళితే చాలామంది అనుమానాలు వ్యక్తం చేశారు. తమ స్థలాలను ఇవ్వడానికి నిరాకరించారు. ఎవరైతే స్థలాలు ఇచ్చారో వారికి ఇచ్చిన మాట ప్రకారం వారు కోరుకున్నట్లుగా స్థలానికి పరిహారంగా అధునాతన భవనాలను నిర్మించి ఇచ్చాం. వాటిని చూసి ఇప్పుడు చాలామంది తమ స్థలాలు తీసుకోవాలని ముందుకు వస్తున్నారు. – ఎన్.వి.ఎస్.రెడ్డి, ఎండీ, హెచ్ఎంఆర్

## విద్యకు ఊతం



గతంలో ఇలా..



నేడు ఇలా..

కూకట్‌పల్లిలో శిథిలావస్థకు చేరిన పాఠశాలకు బదులుగా నిర్మించిన బహుళ అంతస్తుల భవనం

మెట్రోరైలు ప్రాజెక్ట్‌లో భాగంగా రోడ్డు విస్తరణలో నగరంలో రెండు పాఠశాలల స్థలాలను జీహెచ్ఎంసీ సేకరించింది. అక్కడి పాత భవనాలను కూల్చేయాల్సి వచ్చింది. వీటి స్థానంలో హెచ్ఎంఆర్ అత్యాధునిక హంగులతో సరికొత్త భవనాలను నిర్మించింది. చాదర్‌ఘాట్‌లో నాలుగు అంతస్తుల్లో 40వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ భవంతి నిర్మాణాన్ని హెచ్ఎంఆర్ పూర్తి చేసింది. ఇందుకోసం రూ. 5.5 కోట్లను వెచ్చించింది. ఈ కొత్త భవనంలో నాలుగు ప్రభుత్వ పాఠశాలలు నడవనున్నాయి. పాత పాఠశాలను కూల్చివేసి కొత్తది కట్టేందుకు సమయం పడుతుంది. ఈలోపు మెట్రో అధికారుల ఆధ్వర్యంలో పక్కనే ఓ భవనాన్ని పాఠశాలకు అద్దెకు తీసుకున్నారు. భవనం కూల్చినప్పటి నుంచి పిల్లలకు ఇబ్బంది కాకుండా పక్కనే ఉన్న భవనానికి పిల్లలను తరలించారు. ఆ భవనానికి సుమారు కోటి రూపాయల వరకు ఏటా అద్దెను కూడా హెచ్ఎంఆరే చెల్లిస్తోంది.

- కూకట్‌పల్లిలోను ఇంతకుముందు ఇదే తరహాలో భవనాన్ని నిర్మించారు. రహదారి విస్తరణతో పాటు పార్కింగ్ అండ్ సర్క్యులేషన్ కోసం పాఠశాల స్థలాన్ని సేకరించారు. పాతబడిన ఓ చిన్న భవనాన్ని కూల్చివేసి దాదాపు రూ. 7కోట్లు వెచ్చించి నాలుగు అంతస్తుల్లో భవనాన్ని కట్టించారు. ఎల్ ఆకారంలో ఉన్న భవనం అత్యాధునిక హంగులతో సిద్ధమై విద్యార్థులను ఆకర్షిస్తోంది.
- సికింద్రాబాద్ వైఎంసీఏ వద్ద ప్రభుత్వ పాఠశాల స్థలం కొంత సేకరించారు. అక్కడ న్యూగవర్నమెంట్ హైస్కూల్‌కు కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు.

## పచ్చదనం పెంపొందించేలా...



మెట్రో పనుల్లో భాగంగా రహదారి విస్తరణలో చాలా చెట్లు తొలగించాల్సి వచ్చింది. సాధారణంగా ఒక చెట్టు తొలగిస్తే కొత్తగా ఐదు మొక్కలను నాటాల్సి ఉంటుంది. ఈ లెక్కలతో సంబంధం లేకుండానే మెట్రో చెట్ల పెంపకాన్ని చేపట్టింది. వాటి చుట్టూ ట్రీ గార్డులను ఏర్పాటు చేసింది. వృక్షాలను కొట్టేయకుండా వేర్వేరు ప్రాంతాల్లో సుమారు 700 చెట్లను ట్రాన్స్‌లోకేషన్ చేసింది. అవే చెట్లను అవుటర్ రింగు రోడ్డు సమీపంలో, ఎల్‌బీనగర్ వద్ద, మరికొన్ని ప్రాంతాల్లో తీసుకెళ్లి నాటారు. మెట్రో అధికారులు వారు స్వయంగా మొక్కలు నాటడమే కాదు.. ప్రజలను అందులో భాగస్వాములయ్యేలా చూశారు. మూడేళ్లపాటు వర్షకాలంలో 'వనప్రసాదం' పేరుతో 60వేల మొక్కలను నగర ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. మరో 60వేల వరకు కాలనీలు, విశ్వవిద్యాలయాలు, ఇతర సంస్థల ప్రాంగణాల్లో నాటారు. ఇక తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన హరితహారంలోనూ మెట్రో అధికారులు భాగస్వాములయ్యారు. ఈ ఏడాది హరితహారంలో లక్ష మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## 'విస్తరణ'తో తొలగిన ఇబ్బందులు



జేఎన్‌టీయూలో నిర్మాణంలో ఉన్న ఆలయం

గ్రేటర్‌లో రహదారులు ఏళ్లు గడుస్తున్నా చాలా ప్రాంతాల్లో విస్తరించలేదు. మెట్రో పుణ్యమా అని చాలాచోట్ల రహదారులు విశాలంగా మారాయి. ఎన్నో క్లిష్టమైన కూడళ్లు వెడల్పుగా మారాయి. మెట్రో పనులతో ప్రస్తుతం ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నా.. పూర్తయ్యాక ఇబ్బందులు తగ్గనున్నాయి. దాదాపు 1500 ఆస్తుల సేకరణకు ఇప్పటికే సుమారు రూ. 650 కోట్లు వెచ్చించింది. మరో రూ. 150 కోట్లు వెచ్చించనుంది.

- జేఎన్‌టీయూ జంక్షన్ ఉన్న మల్లికార్జున భ్రమరాంబిక ఆలయాన్ని తరలించాల్సి ఉంది. సుమారు రూ. 10లక్షలు వెచ్చించి ఆలయానికి ప్రత్యామ్నాయంగా జేఎన్‌టీయూలోని స్థలాన్ని సేకరించి ఆలయాన్ని నిర్మిస్తున్నారు.